పదేండ్ల విధ్వంసం కాదు.. వందేండ్ల అభివృద్ధి

దశాబ్దకాలంలో రాకెట్ వేగంతో ఆర్థిక వృద్ధి సాధించిన తెలంగాణ

- కేసీఆర్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిందని కాంగ్రెస్ దుష్ప్రచారం
- తలసరి ఆదాయంలో దేశంలోనే మొదటి స్థానానికి తెలంగాణ
- అన్ని రంగాల సమ్మిళిత వృద్ధితో 249 శాతం పెరిగిన జీఎస్డీపీ
- కుండబద్దలు కొట్టిన ఆర్బీఐ 'హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్' నివేదిక

కేసీఆర్ పాలనలోని అభివృద్ధిని కనుమరుగు చేసేందుకు కాంగ్రెస్ చేసిన గ్లోబల్ ప్రచారం అబద్ధమని తేలిపోయింది.

పదేండ్లలోనే వందేండ్ల విధ్వంసం అంటూ చేసిన దుష్ప్రచారానికి 'ఆర్బీఐ' చరమగీతం పలికింది.

కేసీఆర్ దార్శనికత ఫలితంగా తెలంగాణ వందేండ్ల పురోగతి సాధించిందని ఘంటాపథంగా చెప్పింది.

తలసరి ఆదాయం, జీఎస్డీపీ వృద్ధి రాకెట్ వేగంతో దూసుకుపోయిందని 'హ్యాండ్ బుక్' స్పష్టం చేసింది.

దేశ పౌరుల సగటు ఆదాయం కన్నా.. తెలంగాణ బిడ్డలు లక్షన్నర ఎక్కువే సంపాదిస్తున్నారని తేటతెల్లం చేసింది.

? రేవంత్ రెడ్డీ.. దీనిని అభివృద్ధి అంటారా? ఆర్థిక విధ్వంసం అంటారా?

తెలంగాణ ఏర్పడేనాటికి తలసరి ఆదాయం రూ. 1,03,889. దేశంలో 14వ స్థానం. 2023-24నాటికి రూ. 3,56,564కు పెరిగింది. దేశంలోనే మొదటి స్థానానికి చేరింది. రేవంత్ రెడ్డీ.. దీనిని ఆర్థిక విధ్వంసం అంటారా?

2014-15లో రాష్ట్ర జీఎస్డీపీ రూ. 4.3 లక్షల కోట్లు. పదేండ్ల తర్వాత రూ. 15.01 లక్షల కోట్లకు పెరిగినట్టు ఆర్బీఐ స్వయంగా చెప్తున్నది. మరి ఈ 249 శాతం పెరుగుదలను 'ఆర్థిక దోపిడీ' అంటూ దుష్ప్రచారం చేసే మంత్రులకు ఉన్న అవగాహనను ఏ కొలమానంతో కొలవాలి?

> ఒక కుటుంబ ఆదాయం పెరిగితే ఆ ఇల్లు బాగుపడ్డట్టా? నాశనం అయినట్టా? మరి కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్ర తలసరి ఆదాయం, జీఎస్డీపీ పెరిగి, పరపతి పెరిగితే రాష్ట్రం ఆర్థికంగా బాగుపడినట్టా? విధ్వంసం అయినట్టా? కాస్త తెలివి ఉన్న ఎవరికైనా అర్థం అవుతుంది. కానీ కాంగ్రెస్ నేతలకు మాత్రం తలకెక్కడం లేదు.



సొంత పన్నుల రాబడిలోనూ రాకెట్ వృద్ధి

ప్రజలు వివిధ రూపాల్లో ప్రభుత్వానికి చెల్లించే పన్నులను కలిపి సొంత పన్నుల రాబడిగా పిలుస్తుంటారు. సొంత పన్నుల రాబడి పెరగడాన్ని ప్రజల కొనుగోలు శక్తి, రాష్ట్రంలో వ్యాపార కార్యకలాపాలు పెరిగాయనడానికి ప్రతీకగా భావిస్తుంటారు. వ్యవసాయం, ఉద్యోగం, ఉపాధి.. ఇలా ఏదో ఒక రూపంలో ప్రజలకు ఆదాయం పెరిగితేనే కొనుగోళ్లు పెరుగుతాయి. రాష్ట్రంలో అన్ని రకాల సదుపాయాలు ఉంటేనే పెట్టుబడులు వచ్చి పరిశ్రమలు, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, వాణిజ్య సంస్థలు తరలివచ్చి, వాటి ద్వారా పన్ను ఆదాయం పెరుగుతుంది. తెలంగాణ ఏర్పడే నాటికి సొంత పన్నుల ఆదాయం కేవలం రూ.29వేల కోట్లు. కానీ పదేండ్లలోనే రూ.1.36 లక్షల కోట్లకు పెరిగింది. అంటే నాలుగు రెట్లకుపైగా వృద్ధి నమోదైంది. ఈ గణాంకాలు కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.



మూడింతలు పెరిగిన బడ్జెట్

రాష్ట్రం ఆర్థికంగా బలపడిందనడానికి మరొక నిదర్శనం బడ్జెట్. తెలంగాణ ఏర్పడేనాటికి రాష్ట్ర బడ్జెట్ కేవలం రూ.లక్ష కోట్లు. పదేండ్ల తర్వాత బడ్జెట్ మూడు రెట్లు పెరిగి దాదాపు రూ.3 లక్షల కోట్లకు పెరిగింది. ఏ ప్రభుత్వమైనా రాష్ట్రానికి రాబడి పెరిగినప్పుడే రంగాల వారీగా కేటాయింపులు పెంచుతుంది. తదనుగుణంగా నిధులు విడుదల చేస్తూ ఖర్చు పెడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుడు డిసెంబర్‌లో విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం చూసుకున్నా కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 9 ఏండ్లలో రూ.14.87 లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టి రూ.12.25 లక్షల కోట్లు ఖర్చు చేసింది.



కేసీఆర్ దార్శనికత, ప్రణాళికలతో ఆర్థిక పారంగా తెలంగాణ

తెలంగాణ ఆర్థిక పాఠాలు బోధిస్తున్నది. తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో నిలిచింది. తొమ్మిదిన్నరేండ్లలోనే రాష్ట్ర తలసరి ఆదాయం 249% పెరిగింది. జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,49,534 ఎక్కువ. ఇక, జీఎస్డీపీలోనూ గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో తెలంగాణ రికార్డులు నమోదు చేసింది. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2.9% మాత్రమే. అయితేనేం, దేశ జీడీపీ లో తెలంగాణ వాటా 5 శాతాన్ని దాటడం విశేషం.

రాకెట్ వేగంతో జీఎస్డీపీ వృద్ధి

ఆర్థిక వృద్ధిలో తెలంగాణ జెట్ వేగంతో దూసుకెళ్లడంతో గడిచిన తొమ్మిదిన్నరేండ్లలో జీఎస్డీపీ స్థిరంగా పెరుగుతూ వస్తున్నది. దేశ జనాభాలో తెలంగాణ వాటా 2. 9 శాతం. కానీ, దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5.02 శాతంగా ఉండటం విశేషం. 2014-15 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్డీపీ రూ.4,30,599 కోట్లు. 2023-24లో రాష్ట్ర జీఎస్డీపీ రూ.15,01,981. అంటే తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్ర జీఎస్డీపీ రూ. 10,71,382 కోట్లు (249 శాతం) పెరిగింది. తొమ్మిదిన్నరేండ్లలో జీఎస్డీపీ మూడున్నర రెట్లు పెరిగింది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఇంత అతి తక్కువ సమయంలో ఇంత భారీగా జీఎస్డీపీ వృద్ధి జరగలేదు.



తలసరిలో టాప్

కేంద్రపాలిత ప్రాంతం ఢిల్లీ మినహాయిస్తే, తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రాష్ట్రం ఏర్పడినప్పుడు 2014-15వ ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,03,889 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3,56,564. అంటే తొమ్మిదిన్నరేండ్లలో తలసరి ఆదాయంలో తెలంగాణ కనీవినీ ఎరుగని వృద్ధిని నమోదు చేసింది. తక్కువ సమయంలోనే తలసరి ఆదాయం మూడున్నర రెట్లు పెరిగింది. తొమ్మిదిన్నరేండ్లలోనే తలసరి ఆదాయం రూ.2,52,675 (249 శాతం) పెరిగింది. దేశంలో తక్కువ సమయంలో భారీగా తలసరి ఆదాయ వృద్ధి సాధించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. తలసరి వృద్ధిలో జాతీయ సగటు కంటే రాష్ట్ర సగటు మెరుగ్గా ఉన్నది. దేశ సగటుతో పోలిస్తే, తెలంగాణ పౌరుడి సంపాదన 1.5 లక్షలు ఎక్కువ.

అగ్రస్థానమే లక్ష్యంగా..

తెలంగాణ ఉద్యమ నినాదం 'నీళ్లు, నిధులు, నియామకాలు'. దీంట్లో ప్రధానమైన నిధులపై కేసీఆర్ తొలుత దృష్టి సారించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేనాటికి గత కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ఆర్థిక పరిస్థితి దుర్భరంగా ఉండేది. దీంతో రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టం కావాలంటే ఉత్పాదకత పెరుగాలని, అది జరగాలంటే ఆర్థిక రంగంలో సంస్కరణలే మార్గమని కేసీఆర్ గ్రహించారు. ఈ క్రమంలో సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఆర్థిక రంగంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తెలంగాణ ఆర్థిక పరిస్థితి ఏమిటి? రాబడి ఎంత? ఖర్చులేంటి? వంటి కీలకాంశాలపై శ్రద్ధ పెట్టారు. సంపదను సృష్టించి ప్రజలకు పంచి తద్వారా ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేందుకు కొత్త సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఉపాధి కల్పనతో ప్రజలకు చేతినిండా పని కల్పించి వారి ఆదాయాన్ని పెంచి తద్వారా రాష్ట్ర స్థూల జాతీయోత్పత్తిని (జీఎస్డీపీ) మెరుగుపర్చడానికి అవసరమైన చర్యలు చేపట్టారు. ఆర్థిక రంగంపై కేసీఆర్ మార్క్ తొలి ఏడాది నుంచే కనిపించడంతో అతి తక్కువ సమయంలోనే తెలంగాణ సుసంపన్న రాష్ట్రంగా అవతరించింది. కరోనా సంక్షోభం సమయం మినహాయిస్తే, తలసరిలో ఏటా రెండంకెల వృద్ధిరేటును రాష్ట్రం నమోదు చేసింది. రాష్ట్రం ఏర్పడే నాటికి దేశ జీడీపీలో 3.5శాతంగా ఉన్న రాష్ట్ర వాటా ను తొమ్మిదిన్నరేండ్లలో 5 శాతానికి పైగా పెంచడం జీఎస్డీపీ వృద్ధిరేటులో పెరుగుదల ఏ స్థాయి లో నమోదైందో చెప్పకనే చెప్తున్నది.

పిన్న రాష్ట్రం.. పెద్ద అభివృద్ధి

దేశంలో అతిపిన్న రాష్ట్రం తెలంగాణ. భౌగోళికంగా మనది 11వ స్థానం. జనాభా పరంగా చూస్తే 12వ స్థానం. దేశ జనాభాలో తెలంగాణ వాటా కేవలం 2.9 శాతం. కానీ, దేశ జీడీపీలో తెలంగాణ వాటా ఏకంగా 5 శాతం. ఇది విధ్వంసం కాదు.. ఆర్థిక అభివృద్ధికి నిదర్శనం. ఏ ఒక్కరోజులోనో ఇది సాధ్యం కాలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే తెలంగాణ ఆర్థిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఏయే రంగాల్లో ఏ రకమైన సంస్కరణలు చేపడితే ఫలితాలు రాబట్టవచ్చో అధ్యయనం చేశారు. తెలంగాణను ఆర్థికంగా ఉన్నతస్థితికి తీసుకురావడానికి ప్రణాళికలను రచించారు. ఫలితంగా ఎన్నో ఏండ్ల చరిత్ర కలిగిన రాష్ట్రాలు సైతం సాధించలేని ఆర్థిక రికార్డులను తెలంగాణ రాష్ట్రం కేవలం తొమ్మిదిన్నరేండ్లలోనే నమోదు చేసింది. వందేండ్ల చరిత్ర కలిగిన బీహార్, దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వరాష్ట్రమైన గుజరాత్, పెద్దరాష్ట్రం చెప్పుకొనే ఉత్తరప్రదేశ్, సిలికాన్ సిటీ బెంగళూరు రాజధానిగా ఉన్న కర్ణాటకను సైతం తోసిరాజని తలసరి ఆదాయం వృద్ధిలో, జీఎస్డీపీ నమోదులో మిగతా పెద్ద రాష్ట్రాలకు కూడా

ఆర్బీఐ ముద్ర

ఐదేండ్లలో జీఎస్టీ 125%వృద్ధి

ఒక రాష్ట్రం ఆర్థికంగా పరిపుష్టిగా మారాలంటే పన్ను వసూళ్లది కీలక పాత్ర. దేశ ఆర్థిక రాజధాని ఉన్న మహారాష్ట్ర, దేశానికే రోల్‌మోడల్ అని బీజేపీ పదేపదే వల్లె వేస్తున్న గుజరాత్ కంటే తెలంగాణ జీఎస్టీ రాబడిలో కనీవినీ ఎరుగని వృద్ధి సాధించింది. ఐదేండ్లలోనే జీఎస్టీ వసూళ్లలో 125 శాతం వృద్ధిరేటు నమోదు చేసి అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణలో రూ.28,786 కోట్ల జీఎస్టీ వసూలు అయ్యింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.51,870 కోట్ల జీఎస్టీ రాబడి వచ్చింది. అంటే ఐదేండ్లలో జీఎస్టీ ఆదాయం రూ.23,084 కోట్లు పెరిగింది. కేసీఆర్ సారథ్యంలో వాణిజ్య పన్నుల శాఖ దేశంలోని అనేక రాష్ట్రాలకు ఆదర్శంగా మారింది. తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ పనితీరును, సంస్కరణలను అధ్యయనం చేసేందుకు గుజరాత్, ఉత్తరప్రదేశ్‌తోపాటు అనేక రాష్ట్రాల ప్రతినిధులు మన రాష్ట్రంలో పర్యటించడం గమనార్హం.

ఏమిటీ తలసరి, ఏమిటీ జీఎస్డీపీ?

ఒక దేశంగానీ, రాష్ట్రంగానీ అభివృద్ధి చెందిందని చెప్పేందుకు పౌరుల తలసరి ఆదాయాన్ని గీటురాయిగా తీసుకుంటారు. తలసరి ఆదాయ వృద్ధిరేటు ఆ దేశ, రాష్ట్ర అభివృద్ధి ప్రగతికి సూచీగా నిలుస్తుంది. ఏడాదిలో పౌరుడు సంపాదించే మొత్తాన్నే తలసరి ఆదాయంగా పరిగణిస్తారు. ఇక, జీడీపీ (స్థూల జాతీయోత్పత్తి)/జీఎస్డీపీ (స్థూల రాష్ట్ర జాతీయోత్పత్తి)ని వ్యవసాయం, తయారీ రంగం, విద్యుత్తు, గ్యాస్ పంపిణీ, గనుల తవ్వకం, అడవులు, చేపల వేట, హోటల్స్, నిర్మాణం, సమాచార సంబంధాలు, బ్యాంకింగ్, రియల్ ఎస్టేట్, బీమా, వాణిజ్య సేవలు, సామాజిక రంగం, ప్రజాసేవలు తదితర రంగాల నుంచి సేకరిస్తారు. దేశం లేదా రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందిందా? లేదా మందగమనంలోకి వెళ్తుందా? అని నిర్ణయించడంలో జీడీపీ/జీఎస్డీపీనే కీలకం. జీడీపీ వృద్ధి చెందుతుందంటే ఆ దేశం లేదా రాష్ట్రం ఆర్థికంగా, సంక్షేమపరంగా అభివృద్ధిలో పురోగమిస్తుందని అర్థం.

> **ఎకానమిస్ట్ ఏమన్నదంటే?**
>
> కొత్త రాష్ట్రమైనప్పటికీ, పదేండ్లలో తెలంగాణ అద్భుతమైన ప్రగతి సాధించింది. దేశంలోని మరిన్ని కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు ఓ సక్సెస్ ఫుల్ మాడల్‌గా నిలిచింది. దేశ జనాభాలో 2.9 శాతం మాత్రమే వాటా కలిగిన తెలంగాణ జీడీపీలో మాత్రం అనూహ్యంగా 4.9 శాతం వాటాను కలిగి ఉండటం విశేషం.
>
> - బ్రిటిష్ వీక్లీ 'ది ఎకానమిస్ట్' (జూలై, 2023)



కరోనా సమయంలోనూ రాకెట్ వేగం

2020-21లో ఒకవైపు కరోనా మహమ్మారి సంక్షోభం యావత్తు ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్నా మరోవైపు, తెలంగాణకు కేంద్రం ఏకణా ఇవ్వకున్నా కేసీఆర్ నేతృత్వంలోని అప్పటి తెలంగాణ సర్కారు ఎంతమాత్రం వెనుదిరిగి చూడలేదు. ఆ సమయంలోనే దేశ జీడీపీ (-) మైనస్ 1.4 శాతానికి పడిపోగా, తెలంగాణ మాత్రం (+) 1.2 వృద్ధిరేటును నమోదు చేసింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రం ఈ సంక్షోభ సమయంలో ఈ వృద్ధిరేటును నమోదు చేయకపోవడం గమనార్హం.

ఆరుగురు బీహారీలు.. మనోడు ఒక్కడు

మనకంటే వందేండ్ల ముందే రాష్ట్రంగా ఏర్పడి, మూడు రెట్లు ఎక్కువ జనాభా కలిగి ఉన్న బీహార్ పౌరుడి తలసరి ఆదాయం రూ.54,383 మాత్రమే, అంటే బీహార్‌లోని ఆరుగురు సభ్యులున్న ఓ కుటుంబం ఆర్జించే సంపాదనను తెలంగాణలో ఒక్క వ్యక్తే సంపాదించగలడు.

తెలంగాణ తలసరిలో ఎంత మార్పు?

సంవత్సరం	తెలంగాణ	వృద్ధి(%)	దేశం తలసరి	వృద్ధి(%)
2014-15	1,03,889	10.6	86,647	9.5
2015-16	1,40,840	13.5	94,797	9.4
2016-17	1,59,395	13.2	1,03,870	9.6
2017-18	1,79,358	12.5	1,15,224	10.9
2018-19	2,09,848	17.0	1,25,946	9.3
2019-20	2,31,378	10.3	1,32,115	4.9
2020-21	2,31,103	-0.1	1,26,855	-4.0
2021-22	2,75,443	19.2	1,50,007	18.3
2022-23	3,12,398	13.8	1,72,000	13.7
2023-24	3,56,564	14.13	2,07,030	20.3

దేశ జీడీపీ, తెలంగాణ జీఎస్డీపీ (రూ. కోట్లలో)

సంవత్సరం	తెలంగాణ జీఎస్డీపీ	దేశం జీడీపీ	జీడీపీలో తెలంగాణ వాటా (శాతాల్లో)
2014-15	4,30,599	1,24,67,959	3.45
2015-16	5,77,902	1,37,71,874	4.19
2016-17	6,58,325	1,53,91,669	4.27
2017-18	7,50,050	1,70,90,042	4.38
2018-19	8,57,427	1,88,99,668	4.53
2019-20	9,50,090	2,00,74,856	4.73
2020-21	9,43,077	1,98,00,914	4.76
2021-22	11,24,085	2,36,64,639	4.75
2022-23	13,11,823	2,72,03,767	4.82
2023-24	15,01,981	2,99,01,570	5.02

తలసరి ఆదాయం, వృద్ధిలో మనమే టాప్ (రూ.లలో)

రాష్ట్రం	2014-15	2023-24	పెరుగుదల (శాతాల్లో)
తెలంగాణ	1,03,889	3,56,564	249
మహారాష్ట్ర	1,29,235	2,77,603	114
గుజరాత్	1,06,831	2,72,451	155
తమిళనాడు	1,28,366	3,15,220	145
భారత్	86,647	2,07,030	139
ఉత్తరప్రదేశ్	40,373	93,514	131

జీఎస్డీపీ వృద్ధిలో మనమే టాప్ (రూ. కోట్లలో)

తెలంగాణ	4,30,599	15,01,981	249
గుజరాత్	7,65,637	22,03,418	188
తమిళనాడు	9,76,702	27,21,570	179
ఉత్తరప్రదేశ్	9,76,296	25,47,861	161
మహారాష్ట్ర	16,86,694	40,44,250	140
భారత్	1,24,67,959	2,99,01,570	139